క్లుప్తంగా

23న వేమన పద్య కంఠస్థ పోటీలు

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో వేమన పద్య కంఠస్థ పోటీలను ఈనెల 23న స్థానిక వాసవీ క్లాత్ మార్కెట్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి, కార్యదర్శి వడలి రాధాకృష్ణలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరాల, వేటపాలెం మండలాలలోని 25 ఉన్నత పాఠశాలలు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు, మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. అలానే ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని, అలానే పాల్గొన్న ప్రతి విద్యార్థికి వేమన శతకం అందించనున్నట్లు వారు ప్రకటనలో తెలిపారు.

సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్



తహశీల్దార్‌కు అర్జీ ఇస్తున్న రైతు

జే.పంగులూరు: ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌ను ప్రలు వినియోగించుకోవాలని తహశీల్దార్ సింగారావు అన్నారు. స్థానిక పంగులూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఇందులో పలు సమస్యలపై 5 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. వాటిలో 3 ఆన్‌లైన్ సంబంధించి, భూ సమస్యలు1, పాస్‌బుక్ 1 అర్జీలు వచ్చినట్లు తెలిపారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బల్లికురవ: పశువుల ఆరోగ్యంపై పశుపోషకులు ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులు ఆర్ పావని కుమారి, పీ మహేశ్వరరావు కోరారు. సోమవారం వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. కృత్రిమ గర్భధారణతో పశు సంతతి పెంచుకోవాలని, ఈ నెల 31 వరకు షెడ్యూల్డ్ ప్రకారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు కోరారు.

పుస్తకాలు చదవడంతో విజ్ఞానం పెంపు

వేటపాలెం: గ్రంథాలయంలో తరచూ పుస్తకాలు చదవడం వలన విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథపాలకురాలు డీ .ధనమ్మ పేర్కొన్నారు. దేశాయిపేటలో శాఖ గ్రంథాలయంలో 20 మంది విద్యార్థులు సోమవారం సభ్యత్వ నమోదు చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సభ్యత్వ నమోదు కోసం విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య రూ.1000 వితరణగా అందజేశారని తెలిపారు. గ్రంథాలయంలో సభ్యత్వం పొందిన విద్యార్థులు తరచుగా గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞానంతో పాటు తెలివితేటలు సంపాదించుకోవచ్చని పేర్కొన్నారు.

చినగంజాంలో

చినగంజాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులకు రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య చినగంజాం శాఖా గ్రంథాలయంలో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డీ రత్నకుమారి, గ్రంథపాలకుడు అహరి మోహన లక్ష్మీనరసింహాచార్యులు, ఉపాధ్యాయులు ఎస్ నరసింహారావు, శ్రీనివాస దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.



వేటపాలెంలో గ్రంథాలయ సభ్యత్వం అందుకున్న విద్యార్థులతో దాత పేరయ్య

చిన్నారులకు తొలి అడుగులు, గర్భిణులు, బాలింతలకు సరైన పోషకాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలు ఇప్పుడు కష్టాల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం పేరుకేమో.. మేం మాతాశిశు సంరక్షణకు అనేక నిధులిచ్చాం. అభివృద్ధి చేశాం అని గొప్పలు చెప్పుకుంటుందే కానీ ఎక్కడా అభివృద్ధి చేసిన దాఖలాలు కనిపించడం లేదు. దాదాపుగా పదేళ్లుగా కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి.

నిధులు ఫుల్.. పనులు నిల్



కొమ్మినేనివారిపాలెంలో కిటికీల దశలో నిలిచిన అంగన్‌వాడీ భవనం

- సంతమాగులూరు ప్రాజెక్టులో అసంపూర్తిగా 24 భవనాలు
- పదేళ్లుగా ముందుకు సాగని పనులు
- గత ప్రభుత్వ హయాంలో 24 భవననాలు పూర్తి చేసి అందుబాటులోకి
- శిథిలావస్థకు చేరుతున్న అసంపూర్తి భవనాలు



వల్లాపల్లిలో వేరే వాళ్ల ఆధీనంలో ఉన్న అంగన్‌వాడీ



కొణిదెనలో వినియోగంలో లేని అంగన్‌వాడీ కేంద్రం

బల్లికురవ:

మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు గూడు కరువైంది. అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్న కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేసినా పదేళ్లుగా నత్త నడకతో పూర్తి కావడం లేదు. వివరాల్లోకి వెళ్లే.. సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 134 కేంద్రాలు ఉన్నాయి. ఆరంభం నుంచి ప్రాథమిక పాఠశాలలో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. కొందరు దాతలు ప్రభుత్వానికి స్థలాలు కేటాయించిన గ్రామాలకు సొంత భవనాలు మంజూరు చేశారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2015-16లో ఒక్కో భవనానికి రూ.10 లక్షల చొప్పున రెండు మండలాల కలిపి 48 భవనాలు మంజూరు చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 24 భవనాలు పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో వీటిని ప్రారంభంతో వినియోగంలోకి తెచ్చారు.

ఇంకా అసంపూర్తిగా 24 భవనాలు ..

బల్లికురవ మండలంలోని కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, కొణిదెన, గంగపాలెంలో ఎనిమిది భవనాలు. సంతమాగులూరు మండలంలో 16 భవనాలు నత్తనడకతో అసంపూర్తిగానే నిలిచాయి. కొమ్మినేనివారి పాలెం గ్రామంలోని వైఎస్సార్ విగ్రహ సమీపంలో మూడు కేంద్రాలకు సంబంధించి ఒకే చోట భవనాలను నిర్మించారు. లెంటల్ దశలోనే 8 ఏళ్లుగా పనులను నిలిచాయి. చిల్లచెట్లు పెరగడంతో పాటు తలుపులు, కిటికీలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ పూర్తిగా దెబ్బతింటున్నాయి. వల్లాపల్లిలో తుదిదశ పనులు జాప్యంతో భవనం పరాధీనుల ఆధీనంలో ఉంది. కొనిదెన, గంగపాలెంలో కూడా అసంపూర్తి పనులతో వినియోగంలోకి రావడం లేదు. సంతమాగులూరు మండలంలో కూడా పరిస్థితి ఇలానే ఉంది. అద్దె భవనాలకు నెలకి రూ. 2000 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం నిల్వతో పాటు. ఇక్కడే కేంద్రాల నిర్వహణ, భోజనం తయారీతో అసౌకర్యాలతో అందరికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా కూటమి నాయకులు, అధికారులు చొరవ తీసుకొని అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

> **అసంపూర్తి పనులు చేయించేందుకు నివేదించాం..**
>
> 
>
> రెండు మండలాలకు మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాలు సంబంధించి 24 భవనాల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇవి పూర్తి చేయించేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం. పనులు పూర్తయితే అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్న కేంద్రాలకు విముక్తి లభిస్తుంది.
>
> – దాసరి సుధా, సీడీపీవో

ఈ ఏడాదైనా మామిడి కరుణిస్తుందా ?

- మామిడి పంటపై రైతుల ఆందోళన

వేటపాలెం: ఉద్యాన సాగులో రాజాజు మామిడి. గతేడాది మామిడి చెట్టుకు పూత విరగకాసింది. కాని గూడ మంచు కారణంగా ఆశించిన తెగుళ్లతో సరైన పంట పండకపోవడంతో రైతులు నష్టాలు చవిచూశారు. అయితే ఈ ఏడాదైనా మామిడి పంట కరుణిస్తుందా లేదా ? అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. మామిడి తోటల్లో ఇప్పటివరకు ఎక్కువ శాతం పూత రాకపోవడంతో ఈ సీజన్‌లో పంట దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది. అయితే ఈ సారి ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కాగా ప్రస్తుతం భూమిలో తేమ ఎక్కువగా ఉండటంతో పాటు చలి తీవ్రత అధికంగా ఉంది. దీంతో పూత ఆలస్యమయ్యే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు చెప్తున్నారు. చీరాల నియోజకవర్గంలో 400 నుంచి 500 ఏకరాల్లో మామిడి సాగుచేస్తున్నారు. కాగా ఈ ఏడాదైనా మంచి దిగుబడి వస్తుందనే ఆశతో రైతులు ఉన్నారు.



పూత సక్రమంగా లేని మామిడి తోట

రీ సర్వేలో అవకతవకలు వద్దు



గుంటుపల్లిలో రెవెన్యూ మ్యాపు పరిశీలనతో సూచనలు ఇస్తున్న డీటీ

జే.పంగులూరు: రీ సర్వే చేసేటప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సింగారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని స్థానిక బైటమంజులూరు గ్రామంలో సోమవారం తహసీల్దార్ గ్రామంలో రీ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. సర్వే చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు అందించి, పలు రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వే జరిగే సమయంలో ఆ పంట పొలాలకు సంబంధించి రైతులు అందుబాటులో ఉండాలన్నారు. సర్వే పూర్తి అయ్యేంత వరకు వీఆర్ఓలు, సర్వేయర్లు అందుబాటులో ఉంటారని, రైతులు వారికి సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.



బైటమంజులూరులో రీ సర్వే రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

బల్లికురవ: భూముల రీ సర్వే పారదర్శకంగా ముగిసేందుకు రైతులందరు సహకరించాలని రీ సర్వే డీటీ ప్రహర్ష కోరారు. సోమవారం గుంటుపల్లి రెవెన్యూలో రీసర్వేకు శ్రీకారం చుట్టారు. రైతులు తమ వద్దనున్న హక్కుపత్రాలను సర్వే టీమ్‌కు చూపించాలన్నారు.

ఆధార్ క్యాంప్‌లు ఉపయోగించుకోవాలి

అద్దంకి రూరల్: నేటి నుంచి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బీ. సింగయ్య సోమవారం ఇక ప్రకటనలో పేర్కొన్నారు. 21, 22వ తేదీల్లో శింగరకొండపాలెం, 23, 24 వతేదీల్లో ధర్మవరం, 27,28 తేదీల్లో వెంపరాల, 29, 30 తేదీల్లో నాగులపాడు గ్రామాల క్యాంపులో పిల్లలకు బాలఅధార్ కార్డులు, ఆధార్ కార్డులో తప్పులను సరిచేయించుకునే వీలు ఉంటుందని ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకున్న గాత్ర కచ్చేరి



గాత్ర కచ్చేరి చేస్తున్న వివేక్ సదాశివం

చీరాల అర్బన్: చైతన్యభారతి ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు ముంతావారిసెంటర్‌లోని ఎస్‌వీఎస్అండ్ఎస్‌జెఆర్ కళ్యాణమండపంలో ఘనంగా జరుగుతున్నాయి. ఆరాధనోత్సవాలలో భాగంగా సోమవారం హనుమత్ లక్ష్మణ, సీతారామస్వామి, సంగీత సద్గురు త్యాగరాజ స్వామి వార్లకు అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం రాత్రి చెన్నైకు చెందిన వివేక్ సదాశివం గాత్ర కచ్చేరి నిర్వహించారు. గాత్రకచ్చేరికి హైదరాబాద్‌కు చెందిన వీఎస్ గాయత్రి శివానీ వయొలిన్‌ను, గుంటూరుకు చెందిన బీరక సురేష్ మృదంగాన్ని, తెనాలికి చెందిన కాసూరి వెంకటరామకృష్ణ ఘటం సహకారాన్ని అందించారు. కార్యక్రమాలను చైతన్యభారతి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణశాస్త్రిలు పర్యవేక్షించారు. గాత్రకచ్చేరికి సంగీతాభిమానులందరూ హాజరై తిలకించారు.

విద్య మానవుడికి మూడో నేత్రం



బల్లికురవలో మాట్లాడుతున్న ఎంఈవో

బల్లికురవ: విద్య మానవుడికి మూడో నేత్రమని.. ప్రతి ఒక్కరూ చదువుకుని విద్యావంతులు కావాలని ఎంఈవో-2 కె. రమేష్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ ప్రోగ్రామ్ పై వీవోఏలు వలంటీర్ టీచర్లకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు గంటన్నరపాటు ఆటపాటలతో ఎంపిక చేసుకున్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజరారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయనిర్మల, సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి సీసీలు పాల్గొన్నారు.

గుండెపోటుతో పాత్రికేయుడు మృతి



సాంబశివరావు (ఫైల్)

చీరాల టౌన్: సీనియర్ జర్నలిస్ట్ కొల్లిమర్ల సాంబశివరావు (48) గుండెపోటుతో ఆదివారం రాత్రి హఠాన్మరణం చెందారు. పలు దినపత్రికలలో 22 ఏళ్లపాటుగా పనిచేస్తూ సీనియర్ జర్నలిస్ట్‌గా చీరాల ప్రాంతంలో ప్రజాసమస్యల పరిష్కారంలో కీలకంగా వ్యవహరించారు. సాంబశివరావు ఆదివారం రాత్రి తన 'మీడియా హౌస్' కార్యాలయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారి గుండె పోటుకు గురై తన కార్యాలయం కుర్చీలోనే మృతి చెందాడు. సీనియర్ జర్నలిస్ట్‌గా, ప్రైవేటు హిందీ టీచర్‌గా, ల్యాబ్ టెక్నీషియన్‌గా పేరుగాంచిన సాంబశివరావు మృతితో చీరాల ప్రాంత జర్నలిస్టులు తీవ్ర ఆక్రందనకు గురయ్యారు. ఆయన మృతదేహానికి నివాళులు అర్పించేందుకు చీరాల పాత్రికేయులు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ నాయకులు బారులు తీరారు. సాంబశివరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాంబశివరావు కుటుంబానికి అండగా ఉండేందుకు పలువురు జర్నలిస్టులు, పలు పార్టీల నాయకులు తమవంతుగా ఇచ్చిన రూ.70 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య తరపున పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు యాతం మేరిబాబు, బీజేపీ నాయకులు భరణీరావు, సీపీఎం నాయకులు బాబూరావు, పలువురు ప్రజాసంఘాల నాయకులు, శాలివాహన సంఘం నాయకులు, పలువురు పోలీసులు, వైద్య సిబ్బంది సాంబశివరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు సాంబశివరావుకు అంత్యక్రియలు నిర్వహించారు.



సాంబశివరావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న జర్నలిస్టులు

పింఛన్లు ఇప్పించాలని మంత్రికి వినతులు

సంతమాగులూరు (అద్దంకి): గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు పలువురు తమకు పింఛన్లు ఇప్పించాలంటూ వినతి పత్రాలు అందజేశారు. సోమవారం మండలంలోని సజ్జాపురం గ్రామంలో మంత్రి అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం అనంతరం ప్రజా వేదికను ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆన్‌లైన్ సమస్యలు, ఇంటి బిల్లులు, నూతన పింఛన్లు ఇప్పించాలంటూ గ్రామస్తులు ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలన మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ రవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమస్యల గురించి మంత్రితో మాట్లాడుతున్న గ్రామస్తులు

మురుగు కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు గ్రామ పరిధిలోని ప్రధాన మురుగు కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు అంచనాలు తయారు చేశారు. బ్రిడ్జి నిర్మాణం అవసరమైన ప్రాంతాన్ని సోమవారం వారు పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.9 లక్షలు అంచనాలు తయారు చేసి ప్రతిపాదన పంపనున్నట్లు పీఆర్ ఏఈ ఆనంద్ తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో తీవ్ర వర్ష ప్రభావం దృష్ట్యా ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగిందన్నారు. ముఖ్యంగా వాహన రాకపోకలకు పూర్తిగా అవాంతరం కలిగిందని వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేయాలని ప్రజలు కోరారు. ఆయన వెంట పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణం కోసం పరిశీలిస్తున్న ఇంజనీర్ ఆనంద్

అధ్వానంగా అంతర్గత సిమెంట్ రోడ్లు



పేరాల శ్రీనివాస నగర్‌లో పగిలి అధ్వానంగా ఉన్న సిమెంట్ రోడ్డు



ఆనందపేటలో రోడ్డుపై ఏర్పడిన పెద్ద గొయ్యి

- పగిలిన రోడ్లపై వాహనదారులు, పాదచారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

చీరాల రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన కొన్ని అంతర్గత సిమెంట్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. చీరాల పట్టణంలోని పేరాల హైస్కూలు ఎదురు రోడ్డులోని ఆనందపేట, వాడరేవు రోడ్డులోని జక్కావారివీధి, జయంతిపేటలోని శ్మశానానికి వెళ్లే రోడ్డు పేరాల మార్కెట్ ఎదురు రోడ్డులోని సిమెంట్ రోడ్డు పగిలిపోయాయి. ఈ రోడ్లు ఉదాహరణలు మాత్రమే. ఇంకా అనేకచోట్ల రోడ్లు పాడయ్యాయి. కొన్ని రోడ్లు పైపులు వేసేందుకు మున్సిపల్ సిబ్బంది తవ్వగా మరికొన్ని రోడ్లు నాసిరకంగా ఉండడంతో ధ్వంసమయ్యాయి. దీంతో ఆయా రోడ్లపై వాహనాలు తిరగలేక టైర్లు పగిలిపోతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



ధ్వంసమైన జయంతిపేట శ్మశానం రోడ్డు



పేరాల మార్కెట్ ఎదురు పైపులైన్ కోసం పగులగొట్టి వదిలేసిన రోడ్డు